ఘనంగా 'కేంద్రీయ' వ్యవస్థాపక దినోత్సవాలు



పాఠశాల వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న రాంచందర్‌రావు తదితరులు



కేవీ వ్యవస్థాపక దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రసూల్‌పురా: పికెట్ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ 62వ వ్యవస్థాపక దినోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల పూర్వ విద్యార్థి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు మాట్లాడుతూ తన విద్య ప్రయాణానికి పునాది పడిన కేంద్రీయ విద్యాలయానికి తన హృదయంలో ప్రత్యేకస్థానం ఉందన్నారు. విభిన్న సంస్కృతుల ప్రాంతాలు, భాషలకు చెందిన విద్యార్థులు ఒకే పైకప్పు కిందికి చేరి విద్యనభ్యసించడం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతి ప్రదర్శనలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అమెజాన్ సీనియర్ మేనేజర్ బినా భాస్కర్, విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ శీల రవి, బేటి బచావో బేటి పడావో అభియాన్ మాజీ ఇన్‌చార్జి పంకజం శ్రీనివాసన్, జేఎన్‌టీయూ విశ్రాంత ప్రొఫెసర్ గీతా క్రిష్ణమాచార్య, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌లో...

తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాల 62వ వ్యవస్థాపక దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు, భిన్నత్వంలో ఏకత్వ సారాంశంతో కూడిన దేశభక్తి గేయాలకు నృత్యాలను అద్భుతంగా ప్రదర్శించారు. పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయులు పి.సుందరరావు, కుమారస్వామి, దీపాలి చక్రవర్తి, ఎస్.ఎ. మహ్మద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేవీ పాఠశాల వ్యవస్థాపక దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.శ్రీలక్ష్మి, కె.లలిత కళ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు చర్యలు



బాలంరాయి ప్రభుత్వ పాఠశాల్లో పవర్‌బోర్‌వెల్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. బాలంరాయిలోని నల్లగుట్ట ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల్లో పవర్‌బోర్ వెల్ పనులను బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, టీపీసీసీ సెక్రటరీ రాజేష్ యాదవ్‌తో కలసి ఎమ్మెల్యే శ్రీగణేష్ శని వారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ మాట్లాడుతూ పాఠశాల హెచ్ఎం నీటి సమస్యను తన దృష్టికి తీసుకరావడంతో ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు తెలిపానని ఆయన చొరవతో నీటి సమస్య పరిష్కారానికి పవర్ బోర్‌వెల్ ఏర్పాటు చేస్తున్నారని ఇందుకు శ్రీగణేష్‌కు ధన్యవాదాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జీ హెచ్ఎం అరుణకుమారి, నాగరత్న, లీలీబాయి. దేవిక, రవి, సాయి రెడ్డి, కస్తూరి బాయి. మహేష్, హన్మంత్‌రావు, వెంకటేష్ మురళి, మహేష్‌యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



రైల్వే జీఎం ఏకే జైన్ చేతుల మీదుగా గుర్తింపు పత్రాన్ని అందుకుంటున్న మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు

అడ్డగుట్ట: రైల్వే ఉద్యోగులు, కార్మికుల న్యాయపరమైన డిమాండ్ల సాధనకు దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్. శంకర్ రావు అన్నారు. రైల్వే ట్రేడ్ యూనియన్ల గుర్తింపు ఎన్నికల్లో 3,105 ఓట్ల మెజారిటీతో విజయఢంకా మోగించిన ఎస్సీఆర్ మజ్దూర్ యూనియన్ నాయకులు రైల్వే జీఎం అరుణ్‌కుమార్ చేతుల మీదుగా గుర్తింపుపత్రాన్ని అందుకున్నారు. అనంతరం శంకర్‌రావు మాట్లాడుతూ రైల్వే కార్మికుల పక్షాన నిరంతరం నిలబడుతూ వారి సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు సాగే మజ్దూర్ యూనియన్‌కు భారీ మెజారిటీతో పట్టం కట్టారన్నారు. మొత్తం 5 ట్రేడ్ యూనియన్లు పోటీ చేయగా ఎస్సీఆర్ మజ్దూర్ యూనియన్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకొని ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ఏజీఎస్ ఉదయ్ భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీధరన్, కోశాధికారి సరోజినీరెడ్డి, డివిజనల్ కార్యదర్శులు రవీందర్, బుచ్చిరెడ్డి, సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలతో ఎంతో మేలు



ఏసీఎస్ నగర్‌లో ఉచిత వైద్యశిబిరాన్ని సందర్శించిన కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలుఎంతో ఉపయోగకరమని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ కంటోన్మెంట్ సికింద్రాబాద్, జనహిత సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసన్న మాట్లాడుతూ పేదలు నివసించే ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం పట్ల నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ శిబిరంలో నిర్వాహకులు మంజు గుప్త, రామచంద్ర, రమణి, రాజ్ శ్రీరామ్, నరసింహారావు, కృష్ణమోహన్, రాబర్ట్, రాజేందర్‌కుమార్, నర్సింహ మూర్తి, వెంకట నారాయణ, బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, సత్తయ్య, మనోహర్, దాసరి శ్రీను, నరేష్, రాజు పాల్గొన్నారు.

నిరుపేదలకు నాణ్యమైన వైద్యసేవలు



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలు, చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు

ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

చిలకలగూడ: నిరుపేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. సీతాఫల్‌మండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో 52 మంది లబ్ధిదారులకు రూ. 27 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలు, చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకుని నియోజకవర్గానికి చెందిన నిరుపేదలకు అన్నివిధాలా ఆదుకుంటున్నామని వివరించారు. అర్హులైన వారంతా ప్రభుత్వ పథకాల కోసం క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కంది శైలజ, రాసూరి సునీత, లింగాన ప్రసన్నలక్ష్మిలతోపాటు లబ్దిదారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం



ఈఎస్ఐ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సనత్‌నగర్ ఫైర్ సిబ్బంది

సనత్‌నగర్: అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సనత్‌నగర్ ఫైర్ స్టేషన్ లీడింగ్ ఫైర్‌మెన్ ఎనపోతుల రాజు సూచించారు. ఈఎస్ఐ ఆస్పత్రి ఉద్యోగులకు, సిబ్బందికి శనివారం 'అగ్ని ప్రమాదాలు–నివారణ' అనే అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో అగ్ని ప్రమాదానికి ఊతమిచ్చే అంశాలు, వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎప్పటికప్పుడు అగ్నిమాపక పరికరాలను చెక్ చేసుకుని వాటి పనితీరు బాగుండేలా చూసుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాద సమయంలో ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రమాద విషయాన్ని పేషెంట్లకు తెలియకుండా వారిని టెస్ట్‌ల పేరుతోనే, లేక ఇతరత్రా కారణాలు చెప్పి షిఫ్ట్ చేయాలన్నారు. లేనిపక్షంలో పేషెంట్లు ప్రాణాల మీదకు వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. ప్రమాద విషయం తెలియగానే అసెంబ్లింగ్ పాయింట్ వద్దకు చేరుకుని ఎంతమంది పేషెంట్లు, సిబ్బంది బయటకు వచ్చారో చూసుకోవాలన్నారు. తద్వారా లోపల ఎంతమంది ఉన్నారో తెలుసుకుని రిస్క్ చేసి వారిని కాపాడటానికి అవకాశం ఉంటుందన్నారు. ఇళ్లల్లో కూడా గ్యాస్ ఫైర్ అయినప్పుడు ఏవిధంగా వాటిని ఆర్పివేయాలో డెమో ద్వారా తెలియజేశారు.

నేడు చండీహోమం

సనత్‌నగర్: మార్గశిర మాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా సనత్‌నగర్ శ్రీహనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని దుర్గామాత ఆలయంలో ఆదివారం ఉదయం చండీహోమం జరుగుతుందని ఈఓ సత్య నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

నిత్యాన్నదానం



సురేష్‌యాదవ్‌ను సన్మానిస్తున్న శ్రీస్వామి యే శరణం అయ్యప్ప మిత్ర బృందం

సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లో శ్రీస్వామియే శరణం అయ్యప్ప మిత్ర బృందం ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. వందలాది మంది స్వాములు ఇక్కడకు విచ్చేసి భిక్ష స్వీకరిస్తున్నారు. మిత్ర బృందం సభ్యులు బాలరాజ్, శైలేందర్‌యాదవ్ పిలుపు మేరకు శనివారం బీఆర్ఎస్ పార్టీ బేగంపేట డివిజన్ అధ్యక్షుడు సురేష్‌యాదవ్ నిత్యాన్నదాన కార్యక్రమానికి హాజరై నిర్వాహకులను ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు సురేష్‌యాదవ్‌ను శాలువాతో సత్కరించారు.

'సమగ్ర శిక్ష' ఉద్యోగులను పర్మనెంట్ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులను పర్మనెంట్ చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐదు రోజులుగా వారు నిరవధిక సమ్మె చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. విద్యారంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సిబ్బందిని నిర్లక్ష్యం చేడయం తగదన్నారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు సిబ్బందిని రూల్ ఆఫ్ రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్, మెరిట్, రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో ఎంపిక చేసినా పర్మనెంట్ చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. సమ్మె చేస్తున్న సిబ్బందితో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో నేతలు మహేష్‌యాదవ్, కిరణ్‌గౌడ్, కొప్పుల చందుగౌడ్, స్వామికుమార్, అనంతుల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుస్తీపోటీల చాంపియన్ అన్వర్ ఉలూమ్ కాలేజీ జట్టు



విజేతలకు చాంపియన్ కప్‌ను అందజేస్తున్న ప్రొ.రాజ్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అంతర్ కళాశాలల కుస్తీపోటీల అన్వర్ ఉలూమ్ కాలేజీ జట్టుత చాంపియన్ కైవసం చేసుకుంది. వర్సిటీ క్యాంపస్‌లోని సైక్లింగ్ వెల్డ్రోమ్ స్టేడియంలో ఈ నెల 13, 14 తేదీల్లో ఫ్రీ స్టైల్ (ఇష్టం వచ్చినట్లు కొట్టుకోవచ్చు) కుస్తీ పోటీలు జరిగాయి. దీనిలో ఓయూ పరిధిలోని 50 కాలేజీలకు చెందిన 300 మంది రెజలర్లు పాల్గొన్నారు. చాంపియన్‌షిప్ సాధించిన అన్వర్ ఉలూమ్ కాలేజీ జట్టుకు ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజ్‌కుమార్ కప్‌ను సర్టిఫికెట్లను అందజేశారు.

పోషకాహారలోపం నివారణకే డైట్ చార్జీల పెంపు



లాలాపేట బీసీ బాలికల హాస్టల్‌లో కొత్త డైట్ మెనూ విడుదల చేస్తున్న వెంకటాచారి



బీసీ బాలికల హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనాలు చేస్తున్న అధికారులు

జిల్లా రెవెన్యూ ఆఫీసర్ వెంకటాచారి

లాలాపేట: విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని నివారించడానికే ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచిందని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ ఆఫీసర్(డీఆర్‌ఓ) వెంకటాచారి అన్నారు. ఈ మేరకు తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రభుత్వ బీసీ హాస్టల్‌లో శనివారం న్యూ కామన్ మెనూ డైట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి ఉన్నతవిద్య కోసం హైదరాబాద్‌కి వచ్చిన విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలున్నా తక్షణమే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్డీఓ రామకృష్ణ, హైదరాబాద్ యూఎల్‌సీ ప్రేమలత, బీసీ వెల్‌ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆశన్న, ఇతర అధికారులు కృష్ణమాచారి, నర్సింహులు, సంజీవులు, లాలాపేట హాస్టల్ వెల్‌ఫేర్ ఆఫీసర్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల పాఠశాలలు, హాస్టళ్లలోని స్థితిగతులను పరిశీలించేందుకు శనివారం సీఎం, మంత్రులు, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించే కార్యక్రమంలో భాగంగా లాలాపేటలోని ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్‌కు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యతిథిగా వస్తున్నారనే సమాచారంతో అధికారులు ఏర్పాట్లు చేశారు. స్వాగత బ్యానర్‌లు కట్టారు. కానీ, మంత్రి ఈ కార్యక్రమానికి రాలేకపోయారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి: తలసాని



బన్సీలాల్‌పేట్ ఖబరస్తాన్ ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

బన్సీలాల్‌పేట్: అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులకు సూచించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ జీవై కంపౌండ్ సమీపంలోని ఖబరస్తాన్ ప్రాంతాన్ని శనివారం కార్పొరేటర్ కె.హేమలత వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖబరస్తాన్‌లో మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేయాలని, చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్, జలమండలి జీఎం వినోద్, డీజీఎం ఆశీష్‌లతోపాటు మైనార్టీ విభాగం నాయకులు ఫయూమ్, అబ్బాస్, జావీద్, రుక్ముద్దీన్, అన్వర్, శాబుద్దీన్, హుస్సేన్, నుస్రత్, జహంగీర్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేషన్, లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, వెంకటరమణ, సురేష్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న గంగపుత్ర సంఘం సభ్యులు

బౌద్ధనగర్: ప్రభుత్వపథకాలను సద్వినియోగం చేసుకోవాలని గంగపుత్ర సంఘం బౌద్ధనగర్ అధ్యక్షుడు దేశబోయిన రఘు సూచించారు. మూడు రోజులుగా డివిజన్‌లోని వారాసిగూడలో సెంట్రల్ గవర్నమెంట్ అధికారులు గంగపుత్ర సంఘం సభ్యులకు నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్‌ఫాం ప్రొవిజనల్ సర్టిఫికెట్ కార్డు, ఈశ్రమ్ కార్డు, ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన రఘు మాట్లాడుతూ మూడు రోజులుగా గంగపుత్ర సంఘం సభ్యులకు 900 కార్డులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. హచ్ దర్శక్ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగల సుధాకర్, దామెర సదానంద్, శివ, నవీన్, రాజ్‌కుమార్, రమేష్, శ్రీనివాస్, చేతి రఘు, కిరణ్ రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

నరసింహన్ కన్నన్‌కు మూడు అవార్డులు



అవార్డులను అందుకుంటున్న నరసింహన్ కన్నన్

రసూల్‌పురా: ఇండియన్ హ్యూమన్ రైట్స్ అంబాసిడర్స్ ఆర్గనైజేషన్ (ఐహెచ్ఆర్ఏవో), భారత్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సంస్థల ఆధ్వర్యంలో సమాజ సేవకుగాను ప్రముఖ సంఘ సేవకుడు టీపీసీసీ సెక్రటరీ నరసింహన్ కన్నన్‌ను ప్రతిష్ఠాత్మకమైన మూడు అవార్డులుఅందుకున్నారు. ముంబైలో శుక్రవారం రాత్రి జరిగిన ఓ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ డాక్టర్ అవినాష్ సకుండే, బాలీవుడ్ నటి శ్రావణి గోస్వామి చేతుల మీదుగా భారత్ భూషణ్ నేషనల్–2024, గ్లోబల్ లీడర్‌షిప్– 2024 అవార్డులతోపాటు తెలంగాణ రత్న అవార్డులను నరసింహన్ అందుకున్నారు. అవార్డులు తనపై మరింత బాధ్యతను పెంచాయని కన్నన్ అన్నారు. కార్యక్రమంలో ముంబై పోలీస్ ఏసీపీ సుఖ కపిలే, మిస్ ఇండియా పియారాయ్, ఐహెచ్ఆర్ఏవో జాతీయ అధ్యక్షుడు అఫ్సర్ ఖురేషీ తదితరులు పాల్గొన్నారు.

200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు



శిరీష్‌కుమార్ జి.చవాన్‌ను సత్కరిస్తున్న శ్రీమాతా సేవా సమితి సభ్యులు, వైద్యులు

సనత్‌నగర్: ఈఎస్ఐసీ మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో శనివారం సనత్‌నగర్ ఆదిత్యనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీమాతా సేవా సమితి సహకారంతో జరిగిన ఈ వైద్య శిబిరంలో ఈఎస్ఐసీ వైద్యులు, విద్యార్థులు హాజరై దాదాపు 200 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు. ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్ డీన్ డాక్టర్ శిరీష్‌కుమార్ జి.చవాన్, కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ డాక్టర్ దేవదాస్ పి. తొండేరే,అసోసియేట్ ప్రొఫెసర్లు సుధాబాల, డాక్టర్ సురేంద్ర బాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహణకు ముందుకువచ్చి సేవలందించిన ఈఎస్ఐసీ కళాశాల డీన్‌ను మాతా సేవా సమితి అధ్యక్షురాలు విజయ కుసుమ, సభ్యులు కళ్లెం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కృష్ణ తదితరులు శాలువాతో సత్కరించారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్ 53, పచ్చకాకర 23, పందిరి బీర 55, క్యాబేజీ 18, క్యారెట్ 43, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 40, గోకరకాయ 28, కీర 35, దోసకాయ 13, బీట్‌రూట్ 37, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 33, చామగడ్డ 33, మొరంగడ్డ 25, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు దత్తహోమం.. పూర్ణాహుతి



ప్రత్యేక అలంకరణలో శ్రీదత్తాత్రేయస్వామి

సనత్‌నగర్: శ్రీహనుమాన్ దేవాలయ ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీదత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఏడోరోజు ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో అర్చకులు స్వామి వారికి అభిషేకం, అర్చన, హారతి, ప్రసాద వితరణ కార్య క్రమాలు నిర్వహించారు. విశేష పాదుక పూజ, సహస్రనామ పుష్పార్చన, పల్లకీ సేవ కార్యక్రమాల్లో భక్తులు భారీగా పాల్గొన్నారు. ఉత్సవాల ముగింపు రోజైన ఆదివారం గురు చరిత్ర పారాయణ సాంగత సందర్భంగా ఉదయం 9 గంటలకు దత్తహోమం, పూర్ణాహుతి, నైవేద్యం, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ పేర్కొన్నారు.

21న ఎమ్‌వీఎస్‌ఆర్ పూర్వ విద్యార్థుల సమావేశం

లాలాపేట: ఓయూ అనుబంధ కళాశాల మాటూరి వెంకట సుబ్బారావు(ఎమ్‌వీఎస్‌ఆర్) ఇంజనీరింగ్ కాలేజి పూర్వ విద్యార్థుల సమావేశం ఈ నెల 21న నాదర్‌గుల్‌లోని కళాశాల క్యాంపస్‌లో నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వివిధ బ్యాచ్‌లకు చెందిన గ్రాడ్యుయేట్లు ఒకచోట చేర్చడం, నాస్టాల్జియా, నెట్‌వర్కింగ్, భాగస్వామ్య అనుభవాలను పెంపొందించడం ఈ సమావేశం లక్ష్యమని అన్నారు. పూర్వ విద్యార్థుల విజయాలు ఈతరం విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.

ఓయూలో కాంగ్రెస్ సభను అడ్డుకుంటాం

బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



కొంపెల్లి నరేష్- ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించతలపెట్టిన విజయోత్సవ సభను అడ్డుకుంటామని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపెల్లి నరేష్ శనివారం హెచ్చరించారు. విద్యారంగ సమస్యలను పట్టించుకోకుండా ఏముఖం పెట్టుకొని వర్సిటీలో సభను నిర్వహిస్తారని ఆయన ప్రశ్నించారు. నియంతలా వ్యవహరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధిని, హామీలను విస్మరించి బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్‌పై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. పూర్తిస్థాయిలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, వర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల వచ్చే ఏడాది నుంచి నిరంతరం ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి కోర్సుల్లో టెక్ మహీంద్ర శిక్షణ

సనత్‌నగర్: టెక్ మహీంద్ర ఫౌండేషన్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ(సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా టెక్ మహీంద్ర స్మార్ట్ అకాడమీ(హైదరాబాద్) నిరుద్యోగులకు సరఫరా చేసే చైన్ మేనేజ్‌మెంట్, వేర్‌హౌస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో స్కాలర్‌షిప్‌తో కూడిన శిక్షణ ఇచ్చి ఉపాధిని అందిస్తున్నట్లు ప్రాజెక్ట్ మేనేజర్ దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిగ్రీ, పీజీ అర్హత కలిగిన 19 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సున్న యువతకు శిక్షణ, ప్లేస్‌మెంట్‌ను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెలాఖరున ప్రారంభం కానున్న కొత్త బ్యాచ్‌లో మహిళలకు 50 శాతం స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా ఉన్న టెక్ మహీంద్ర స్మార్ట్ అకాడమీ ఫర్ లాజిస్టిక్స్ కార్యాలయంలో గానీ, 7337332606 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై వ్యక్తి మృతి

సికింద్రాబాద్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం... గుండ్లపోచంపల్లి ప్రాంతానికి చెందిన మధుర ఆంథోని(55) వృత్తిరీత్యా వంటపని చేస్తుంటాడు. మద్యానికి బానిసైన ఇతను శనివారం ఉదయం 10 గంటల సమయంలో గుండ్ల పోచంపల్లి రైల్వేస్టేషన్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన రైల్వే పోలీసులు అతడి వద్దకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

ఇరువురి అరెస్టు.. గంజాయి స్వాధీనం

బన్సీలాల్‌పేట్: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తాగడానికి ప్రయత్నించిన ఇరువురిని గాంధీనగర్ పోలీసులు అదుపులోకి తీసుకొని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రాజు కథనం ప్రకారం... కవాడిగూడ సీజీఓ టవర్స్ వద్ద గంజాయి విక్రయదారులు ఉన్నారనే సమాచారంతో దాడి చేసి బన్సీలాల్‌పేట్ ప్రాంతానికి చెందిన పి. సిమోన్(24), బాగ్‌లింగంపల్లి నివాసి డి.లోకేష్(23)లను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఇరువురు కలిసి గంజాయి తాగడానికి ప్రయత్నిస్తుండగా అరెస్ట్ చేశామన్నారు. నిందితుల వద్ద నుంచి 30 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ రాజు వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయాలు సాగించినా, తాగుతున్నా వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. గంజాయి అమ్మకాలు, సేవించే వ్యక్తులపై కఠినంగా వ్యవహరిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ రాజు తెలియజేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సనత్‌నగర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బేగంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరేడ్‌గ్రౌండ్ గేట్ నెంబర్-8 వద్ద గుర్తుతెలియని వ్యక్తి(50) అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో 108 వాహన సిబ్బందితో అక్కడికి చేరుకుని సదరు వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.